ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
5
శనివారం 27 సెప్టెంబరు 2025

పరిశ్రమలను తరిమేసిన వైసీపీ



- 20లక్షల ఉద్యోగాలు ఇచ్చి తీరుతాం
- మండలిలో మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలన్నింటిని వైసీపీ తరిమేసిందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ మండిపడ్డారు. శుక్రవారం శాసన మం డలిలో సూపర్ సిక్స్ పథకాలపై జరిగిన చర్చలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలోని యువ తకు ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతోనే తాము పనిచేస్తున్నామన్నారు. ఇటీవల నిర్వ హించిన డీఎస్సీ ద్వారా 16వేల మంది ఉద్యోగాలు పొందారన్నారు. సచివాలయం సమీపంలో నిర్వహించిన వేడుకకు డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు హాజరై సంతోషం వ్యక్తం చేశారని తెలిపారు. 20లక్షల ఉద్యోగాలు కల్పించి తీరుతామన్నారు. పది లక్షల కోట్ల పెట్టుబడులకు కేబినెట్ క్లియరెన్స్ ఇచ్చిందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన 13లక్షల కోట్ల ఎంవోయూల్లో ఏ ఒక్కటి గ్రౌండ్ అవ్వలేదన్నారు. . పేరుగాంచిన అమరరాజ కంపెనీకి ఎన్నో ఇబ్బందులు పెట్టారన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో లబ్ధి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు అర్బన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్రం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణల తో ప్రతి కు టుంబానికి లబ్ధి చేకూరిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఎస్టీ సంస్కరణలపై ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతికార్యకర్త, నాయకుడుపై ఉందన్నారు. మూడు దశల్లో జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలు, మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, నియోజవర్గం ఇన్‌చార్జిలు బాధ్యతగా కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు. ఈనెల 30 వరకు మొదటి దశ, అక్టోబరు 1నుంచి 18 వరకు రెండో దశ, అక్టోబరు 19 నుంచి ముగింపు కార్యక్రమాన్ని భారీఎత్తున నిర్వహించాలన్నారు.

మరో రెండు రోజుల పాటు వర్షాలు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం మండలంలో దాదాపు 6.10మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదయిందని చెప్పారు. అలాగే కర్నూలు జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

ఎల్లుండి నుంచి జూనియర్ కళాశాలలకు దసరా సెలవులు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలకు సోమవారం నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు జిల్లా వృత్తి విద్యాధికారి రమేశ్‌బాబు శుక్రవారం తెలిపారు. అక్టోబరు 6వ తేదీన కళాశాలలు పునఃప్రారంభమవుతాయని తెలిపారు. సెలవు రోజుల్లో ఎలాంటి తరగతులు నిర్వహించకూడదని ఆయన ఆదేశించారు.

పత్తికి విపత్తు..!

ఎన్నో ఆశలతో సాగు చేసిన పత్తి పంట చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలు నిండా ముంచేశాయి. అధిక తేమకు విజృంభిస్తున్న తెగుళ్లతో కష్టజీవులకు కష్టాలు.. నష్టాలు పెరుగుతున్నాయి. చెట్టుపైనే కాయలు కుళ్లిపోతున్నాయి. తీసేందుకు సిద్ధంగా ఉన్న తెల్లబంగారం నేలపాలవుతోంది. విత్తనాలు మొలకెత్తడం.. పత్తి రంగు మారడంతో రైతులు కదేలవుతున్నారు. ఎకరాకు మూడు నాలుగు క్వింటాళ్ల దిగుబడి కోల్పోతున్నామని అన్నదాతలు ఏకరువు పెడుతున్నారు. ధరలు పతనమై ఉల్లి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. తాజాగా ఆ జాబితాలో పత్తి రైతులు చేరుతున్నారు. జిల్లాలో 5.43 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అధిక వర్షాలు కారణంగా దాదాపుగా 16 లక్షల క్వింటాళ్లు పత్తి దిగుబడులు నష్టపోతున్నామని కన్నీళ్లు పెడుతున్న పత్తి రైతుల ఆవేదనపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.



ఆదోని మండలం మదిరె గ్రామంలో పత్తి పంటను పరిశీలిస్తున్న నంద్యాల ఆర్ఏఆర్ఎస్, బనవాసి కేవీకే శాస్త్రవేత్తలు

- అధిక వర్షాలతో పంటను పీడిస్తున్న తెగుళ్లు
- కుళ్లిపోతున్న కాయలు
- వానలకు నేలపాలవుతున్న తెల్లబంగారం
- ఎకరాకు రెండు మూడు క్వింటాళ్లు నష్టం



కర్నూలు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పత్తి సాగులో కర్నూలు జిల్లా అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రంలో 4.02 లక్షల హెక్టార్ల (10.05 లక్షల ఎకరాలు)లో పత్తి సాగు చేశారని ప్రభుత్వ అంచనా. అందులో ఒక్క కర్నూలు జిల్లాలోనే 2.17 లక్షలు హెక్టార్లు (5.43 లక్షల ఎకరాలు)లో పత్తి సాగు చేశారు. ఎకరానికి సగటున రూ.45-50 వేలు పెట్టుబడి పెట్టినట్లు అంచనా. ఈ లెక్కన రూ.2,500 కోట్లకు పైగా పత్తి సాగు కోసం సేద్యం, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కలుపులు.. ఇలా వివిధ రూపాల్లో మట్టిలో పోశారని సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త ఒకరు వివరించారు. జూన్, జూలై నెలల్లో పత్తి విత్తనాలు నాటారు. మొలకెత్తి పత్తి పచ్చగా ఏపుగా పెరుగుతుంటే కష్టాలు తీరుతాయని సంబర పడ్డారు. చెట్టుకు 15-20 కాయలు కాసి, పంట చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలు నిలువున ముంచెత్తాయి. రైతులకు ఊహించని నష్టం మిగిల్చింది. పైన పచ్చగా కనిపించే పత్తి పంట దిగువన కుళ్లిన కాయలు కన్నీళ్లు పెట్టిస్తున్నాయి.



పత్తి కాయను ఆశించిన కుళ్లు తెగులు

- రూ.1.250 కోట్ల విలువైన దిగుబడులు నష్టం

జిల్లాలో గత నెలలో కురిసిన అధిక వర్షాలకు మొగ్గలు, పూత రాలిపోవడమే కాకుండా అధిక తేమకు కాయలు నల్లబారి కుళ్లిపోయాయి. తాజాగా వర్షాలకు మరింత నష్టం చేకూరింది. కాయలు కుళ్లిపోవడమే కాకుండా, అరకొర ఎండలకు కాయలు పగిలి పత్తిని రేపోమాపో తీద్దామని అనుకుంటే జిల్లాలో కురిసిన వర్షాకుల నేల రాలిపోతోంది. తెల్లబంగారం రంగు మారి చెట్టుపైనే పత్తిలో విత్తనాలు మొలకలు వస్తున్నాయి.

మిగతా 7వ పేజీలో

వరుణదేవా.. శాంతించవా..!



నీట మునిగిన పత్తి పంట

- ఎడతెరిపి లేని వర్షాలు
- నీట మునిగిన పొలాలు
- ఆందోళనలో అన్నదాతలు
- ఈనెలలో ఇప్పటికే 145 మి.మీ వర్షపాతం నమోదు

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నెల రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వరుణదేవా.. ఇక శాంతించవా అంటూ అన్నదాతలు వేడుకుంటున్నారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు వర్షం కురుస్తూనే ఉంది. చేతికొచ్చిన పంటలు నీటిపాలై నష్టపోతామోనని రైతులు ఆందోళనలు చెందుతున్నారు. ఇప్పటికే ఉల్లి పంటపై వర్షాలు తీవ్ర ప్రభావం చూపాయి. కర్నూలు మార్కెట్ యార్డుకు రైతులు తెచ్చిన ఉల్లిని క్వింటానికి రూ.50 నుంచి రూ.100కు అమ్ముకోలేక యార్డులోనే రైతులు వదిలిపెట్టి వెళ్తున్నారు. ఈ పరిస్థితి మిగిలిన పంటలకు ఎక్కడ వస్తుందోనని వారు కన్నీరు మున్నీరు అవుతున్నారు. సెప్టెంబరు నెలలో కురవాల్సిన వర్షం 93.2మి.మీ కాగా, ఇప్పటికే 145మి.మీ వర్షపాతం నమోదైంది. ఇలాగే వర్షాలు కురిస్తే పంటలు మరింత దెబ్బతినే ప్రమాదముందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. వేరుశనగ, పత్తి, కంది, మొక్కజొన్న, మిరప, ఉల్లి, ఆముదం పంటలన్నీ దసరా పండుగ పూర్తి కాగానే పెరికేసి అమ్మకానికి మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పత్తి పంట పక్వానికి వచ్చింది. కర్నూలు జిల్లాలో 2.10లక్షల హెక్టార్లలో ఈపంట సాగైంది. ఆదోని మార్కె ట్ యార్డుకు ప్రతిరోజూ 5వేల నుంచి 10వేల క్వింటాళ్ల దాకా అమ్మకానికి రైతులు తీసుకెళ్తున్నారు. వేరుశనగ పంట కూడా ప్రస్తుతం రైతుల చేతికి అందుతోంది. కర్నూలు మార్కెట్‌యార్డుకు ప్రతిరోజు 1000 క్వింటాళ్ల దాకా అమ్మకానికి తీసుకువస్తున్నారు. వరుణదేవుడు కొంత మేర విరామం ఇస్తే పంటలన్నీ చేతికంది, ఖరీఫ్‌లో రైతులకు ప్రయోజనం కలిగే అవకాశం ఉంది.

హంద్రీకి నీటి విడుదల

- జీడీపీ 4వ గేటు ఎత్తివేత
- ప్రాజెక్టు కట్టను పరిశీలించిన ఎస్ఈ, ఈఈ



నీటి విడుదల చేస్తున్న దృశ్యం

గోనెగండ్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జీడీపీ(గాజులదిన్నె ప్రాజెక్టు) 4వ గేటు ఎత్తి 500 క్యూసెక్కులు నీటిని హంద్రీ నదికి శుక్రవారం విడుదల చేసినట్లు ఏఈ మహమ్మద్ అలీ తెలిపారు. గురువారం సాయంత్రం నుంచి ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, ఆస్పరి, దేవనకొండలో ఒక మోస్తారు వర్షం కురిసింది. శుక్రవారం మధ్యాహ్నంకు జీడీపీకి వరద వచ్చి చేరింది. ప్రస్తుతం జీడీపీలో పూర్తిస్థాయిలో నీటి మట్టం ఉందన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటిని ఎప్పటికప్పుడు దిగువకు విడుదల చేస్తామన్నారు. ప్రాజెక్టు కరకట్టను ఎస్ఈ బాలచంద్రారెడ్డి, ఈఈ పాండురంగయ్య పరిశీలించారు. కట్టచుట్టూ పెరిగిన ముళ్ల కంపలను చూసి వారు అసహనం వ్యక్తం చేశారు. ఆరు క్రస్టుగేట్లలో ఎన్ని పనిచేస్తున్నాయి.. ఎన్ని పనిచేయడం లేదో జీడీపీఅధికారులను అడిగి తెలుసుకున్నారు.

బన్నీ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ డా.సిరి, పక్కనే ఎస్పీ విక్రాంత్ పాటిల్

- ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేస్తాం
- కలెక్టర్ సిరి
- హింసకు పాల్పడితే చర్యలు : ఎస్పీ విక్రాంత్

ఆలూరు/ఆలూరు రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసరా రోజున దేవర గట్టు మాల మల్లేశ్వరస్వామి ఆలయంలో జరిగే బన్నీ ఉత్సవాలను భక్తులు ప్రశాంతంగా జరుపు కోవాలని కలెక్టర్ సిరి అన్నారు. శుక్రవారం ఆలూరు నియోజకవర్గంలోని దేవరగట్టు మాల మల్లేశ్వరస్వామి ఆలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలపై పరిసర గ్రామ పెద్దలు, అధికారులతో వారు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాలకు ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆయా శాఖల అధికారులు అవసరమైన ఏర్పాట్లన్నీ ఉత్సవాలకు రెండు రోజులు ముందే పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఒక్కరూ ఆనందభరితమైన వాతావరణంలో పండుగను జరుపుకోవాలని కలెక్టర్ గ్రామస్థులకు పిలుపునిచ్చారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ మాట్లాడుతూ బన్నీ ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. హింసకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పటిష్టమైన బందోబస్తు, వంద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నా రు. అల్లర్లు సృష్టించే వారిపై నిఘా ఉంచాలని, అగ్గి కాగడాలు భక్తులపైకి విసరకుండా చూ డాలన్నారు. కార్యక్రమంలో ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్, పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌కుమార్, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, డీపీవో భాస్కర్, డీఎంహెచ్‌వో శాంతికళ, ఆలూరు తహసీల్దార్ శోభాసువర్ణమ్మ, ఎంపీడీవోలు, ఫారెస్ట్, ట్రాన్స్‌కో, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ ఇంజనీర్లు, ఎక్సైజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్కందమాతగా భ్రామరి

- వర్షం కారణంగా గ్రామోత్సవం రద్దు



శేష వాహనంపై స్వామి, అమ్మవారు

శ్రీశైలం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా జరిపిస్తున్నారు. ఐదో రోజైన శుక్రవారం భ్రమరాంబికాదేవి స్కందమాతగా భక్తులను అనుగ్రహించారు. స్కందమాతగా ఆశీనురాలై చతుర్భుజాలు కలిగి పద్మం, కమలం, అభయ హస్తం ధరించి, ఒడిలో బాల షణ్ముఖుడైన కుమారస్వామి (స్కందుడు)తో భక్తులకు దర్శనమిచ్చారు. శేష వాహనంపై శ్రీశైల మల్లన్నతో కలిసి అమ్మవారు భక్తులకు కనువిందు చేశారు. అయితే వర్షం కారణంగా గ్రామోత్సవాన్ని రద్దు చేశారు. ఉత్సవ అలంకరణలో భాగంగా స్కందమాతగా అమ్మవారు, మల్లికార్జున స్వామిని భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి ఆస్థాన సేవ నిర్వహించారు. సాయంత్రం ఆలయ దక్షిణ మాడ వీధిలో ఏర్పాటు చేసిన కళారాధన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు చేసిన నృత్యాలు, సంగీత విభావరిని భక్తులు తిలకించారు.



నేడు కాత్యాయని అలంకరణ

దసరా ఉత్సవాల్లో ఆరో రోజు శనివారం భ్రమరాంబికా అమ్మవారు కాత్యాయనిగా దర్శనమిస్తారు. స్వామి, అమ్మవార్లకు హంస వాహన సేవ, పుష్ప పల్లకి సేవ నిర్వహించనున్నారు.

రూ.25లక్షల నోట్లతో...



రూ. 25లక్షలతో ధనలక్ష్మి అలంకారంలో దర్శనమిస్తున్న వాసవీమాత

ఎమ్మిగనూరుసెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసరశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో వెలసిన కన్యకపరమేశ్వరి ఆలయంలో గురువారం వాసవిమాత భక్తులకు ధనలక్ష్మి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని రూ.25 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. అలాగే పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దుర్గాదేవి అమ్మవారిని రూ. 6లక్షల రుపాయలతో ధనలక్ష్మి అలంకారంలో అలంకరించారు.



వీవర్స్ కాలనీ మైదానంలో రూ. 6లక్షలతో అలంకరించిన దృశ్యం

ఐదో రోజు..

● అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

కర్నూలు కల్చరల్/ బనగానపల్లె/ మంత్రాలయం/ గూడూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో దసరా దేవీ నవరాత్రి ఉత్సవాలు శోభాయమానంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజు శుక్రవారం అమ్మవారిని భక్తులు స్కందమాతగా పూజించారు. ఆయా ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కర్నూలు నగరంలోని మించిన్ బజార్ పెద్ద అమ్మవారిశాలలో వాసవీ మాత చండికా దేవి అలంకరణ, పూలబజార్‌లోని చిన్న అమ్మవారిశాలలో ధనలక్ష్మి దేవి, శ్రీలలితా పీఠంలో అమ్మవారు లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వన్‌టౌన్‌లోని గీతామందిరంలో సింహవాహినిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

బనగానపల్లె మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత స్కందమాత అలంకరణలో దర్శనమిచ్చారు. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ ధనలక్ష్మి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధరకాల పుష్పాలు, కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. గూడూరు మండలం కె.నాగలాపురంలో ఐదవ రోజు సుంకులాపరమేశ్వరి అమ్మవారు మహాలక్ష్మి దేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ రాధాకృష్ణ, గ్రామ పెద్దలు గోపాల్ రెడ్డి, సురేష్, సిబ్బంది కేశవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నంద్యాల పట్టణం బాలాజీకాంప్లెక్ కల్యాణ మండపంలో రూ.5లక్షల కరెన్సీ నోట్లతో మహాలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు



మహానందిలో స్కందమాత అలంకరణలో కామేశ్వరీదేవి

మహానంది: మహానంది క్షేత్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కామేశ్వరీ దేవి స్కందమాతదుర్గగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు యాగశాల మండపంలో చండీ యాగం, హోమాలను నిర్వహించారు. సాయంత్రం కామేశ్వరీదేవి అమ్మవారిని స్కంద మాత దుర్గగా అలంకరించి నంది వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, నీలకంఠేశ్వర రాజు, పసుపుల సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.



బుధవారపేటలో..



కె నాగలాపురంలో మహలక్ష్మి దేవి అలంకరణలో సుంకులాపరమేశ్వరి దేవి



నందవరంలో స్కంద మాత అలంకారంలో శ్రీచౌడేశ్వరీమాత



గీతా మందిరంలో శ్రీసింహవాహిని అలంకరణలో అమ్మవారు



కర్నూలు నగరం దేవనగర్ యూత్ ఆధ్వర్యంలో మహలక్ష్మీదేవి దుర్గామాత దర్శనం

నేడు, రేపు 'గుర్రం జాషువా' జయంతి వేడుకలు



కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆధునిక తెలుగు సాహిత్యాన్ని మలుపుతిప్పిన మహనీయుడు గుర్రం జాషువా జయంతి వేడుకలు ఆదోని, కర్నూలు ప్రాంతాల్లో శనివారం, ఆదివారం రెండు రోజులు జరగనున్నాయి. శనివారం ఉదయం 10:30 గంటలకు ఆదోని పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాల్లో అభ్యుదయ రచయితల సంఘం (అరసం), రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) సంయుక్త ఆధ్వర్యంలో జాషువా జయంతి సభను నిర్వహిస్తున్నట్లు ఎస్టీయూ ఆదోని పట్టణ అధ్యక్షుడు కె.రవి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్ హాజరవుతారని తెలిపారు. అనంతరం కవి సమ్మేళనం ఉంటుందన్నారు.

● కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు మహాకవి, పద్మభూషణ్ జయంతి సభను నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్ష, కార్యదర్శులు కళారత్న పత్తి ఓబులయ్య, సి.యాగంటీశ్వరప్ప, కోశాధికారి కె.రామస్వామి తెలిపారు. ఈ సభలో ప్రముఖుల ఉపన్యాసాలు, కళాకారులచే జాషువా రచించిన పద్య గేయాలాపన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో విద్యార్థులను ఆదుకున్నాం

● కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత చింతామెహన్

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో విద్యార్థులకు ఫుల్ మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్‌లు ఇచ్చి ఆదుకున్నామని కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చింతామెహన్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. సంక్షేమ హస్టళ్లలో విద్యార్థులకు మెస్ చార్జీలు కూడా ప్రభుత్వాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. మెస్ చార్జీలు కట్టలేక ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులు కష్టపడుతున్నారని వాపోయారు. మాదిగలకు సామాజిక న్యాయం చేయకుంటే సీఎం పదవి నుంచి దిగిపోవాలన్నారు. కర్నూలు నగరంలో అభివృద్ధి జరగలేదని, నగరంలో ట్రాఫిక్ సమస్య అస్తవ్యస్తంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు బ్యాంకుల్లో పేరుకుపోయిన రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు అశోకరత్నం, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

కర్నూలుకు చేరిన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర



రాజ్యాంగ పరిరక్షణ యాత్రను ప్రారంభిస్తున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 3వ తేదీన కుప్పం నుంచి ప్రారంభమైన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర శుక్రవారం కర్నూలుకు చేరుకుంది. నగరంలోని రాజ్‌విహార్‌లోని అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దళిత విభజన దేశ విభజనకు దారి తీస్తుందేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఎస్సీలు ఉన్నారని, వారిలో 800 ఉప కులాలు ఉన్నాయని చెప్పారు. ఎన్డీయే అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ హక్కులు హరిస్తున్నారని ఆరోపించారు. దాడులు, హత్యలు, అత్యాచారాలు సంఘటనలు పెరిగాయన్నారు. ఎస్సీలందరూ ఐక్యంగా ఉండాలని, ఐకమత్యంతో అధికారం ఉంటేనే ఆర్థికంగా ఎదగవచ్చని అన్నారు. ఏపీలో దళిత విభజన బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ బాబు మాట్లాడుతూ అనువునంగా రిజర్వేషన్లను 15 నుంచి 20 శాతం పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ నాయకులు అశోక్‌రత్నం, దళిత సంఘాల నాయకులు విద్యార్థి యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

పత్తికి విపత్తు..!

5వ పేజీ తరువాయి

ఎకరాకు మూడు నాలుగు క్వింటాళ్ల దిగుబడి నష్టపోతున్నాయి. వ్యవసాయ శాఖ అధికారుల అంచనా మేరకు జిల్లాలో 5,43,575 ఎకరాల (2,17,430 హెక్టార్లు)లో పత్తి సాగు చేశారు. రైతులు చెబుతున్నట్లు ఎకరాకు సగటున 3 క్వింటాళ్ల దిగుబడి కోల్పోయినా 16.30 లక్షల క్వింటాళ్ల (1.63 లక్షల టన్నులు) నష్టపోవాల్సి వస్తోంది. మద్దతు ధర రూ.8,110 ప్రకారం దాదాపుగా రూ.1,250 కోట్లు విలువైన పత్తి దిగుబడులు మట్టిపాలై అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విజృంభిస్తున్న తెగుళ్లు

అధిక వర్షాలు.. అధిక తేమకు పత్తి పంటపై తెగుళ్ల విజృంభిస్తున్నాయి. ప్రస్తుతం కాయకుళ్లు తెగులు రైతును కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. చెట్టుకు 15-20 కాయలు ఉంటే సగానికి పైగా కాయలు కుళ్లిపోయాయి. పగిలిన పత్తి కూడా తేమకు విత్తనాలు మొలకలు రావడమే కాకుండా తెల్లని పత్తి రంగుమారుతుంది. నంద్యాలకు చెందిన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన క్షేత్రం (ఆర్‌ఏఆర్‌ఎస్), ఎమ్మిగనూరు మండలం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ చైతన్య, డాక్టర్ రాఘవేంద్ర చౌదరి, డాక్టర్ రాఘవేంద్రలు ఆదోని మండలంలోని మదిరె, పర్వతాపురం, ఆలూరు మండలం హాళేబీడు, హాలహర్వి మండలం బాపురం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పత్తి పొలాలను పరిశీలించారు. కాయ కుళ్లు తెగులు తీవ్రంగా ఉందని, చెట్టుపై కాయలు కుళ్లిపోయి పత్తి దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు.



చెట్టుపైనే పగిలిన పత్తి విత్తనాలు మొలకలు వస్తున్న దృశ్యం

చెట్టుపైనే మొలకలు వచ్చాయి



ఐదు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. ఎకరాకు రూ.50 వేలు చొప్పున రూ.2.50 లక్షలు అప్పు చేశా. ఎకరాకు కనీసం 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశించా. పంట చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలకు కాయ కుళ్ల తెగులు వ్యాపించి చెట్టుపైనే కుళ్లిపోయింది. పగిలిన పత్తి తీసేందుకు అకాశం లేక విత్తనాలు మొలకలు వస్తున్నాయి. అరకొర పత్తి నేలరాలిపోతోంది. ఎకరాకు నాలుగు క్వింటాళ్ల చొప్పున 20 క్వింటాళ్ల దిగుబడి కోల్పోవాల్సి వచ్చింది. మద్దతు ధర రూ.8,110 ప్రకారం రూ.1.62 లక్షలు నష్టపోక తప్పడం లేదు.

● హెచ్.ఈరప్ప, నెట్రవట్టి గ్రామం, హాలహర్వి మండలం

పత్తి కాయలు కుళ్లిపోయాయి



నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేసి రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టా. మొదట్లో పంట పచ్చగా ఏపుగా పెరుగుతుంటే మూడేళ్ల కష్టాలు తీరుతాయని ఆనందం కలిగింది. చెట్టుకు 20 కాయలకు పైగా వచ్చాయి. కాయ పగిలే దశలో అధిక వర్షాలు నిలువునా ముంచేశాయి. తేమకు కాయకుళ్ల తెగులు వ్యాపించి చెట్టుపైనే కాయలు నల్లబారి రాలిపోతున్నాయి. ఎకరాకు రెండు మూడు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.

● జగ్గుల మల్లేశ్, చింతకుంట గ్రామం, కోసిగి

కాయ కుళ్లు తెగులు వ్యాపించింది



ఆదోని, ఆలూరు, హాలహర్వి మండలాల్లో నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు, స్థానిక వ్యవసాయ అధికారులతో కలసి పత్తి పంటలను పరిశీలించాం. అధిక వర్షాలు, తేమకు కాయతొలుచు పురుగు ఆశించింది. పురుగుల రంధ్రాలు ద్వారా శిలీంద్రాలు కాయలోకి చేరుకుని కాయ మొత్తానికి వ్యాపిస్తుంది. చెట్టుపైనే కాయలు కుళ్లి పోవడం గుర్తించాం. అలాంటి కాయలు పత్తి పగిలినా నాణ్యత ఉండదు. కాయకుళ్ల తెగులు ఆశించకుండా ముందు జాగ్రత్తగా రైతులు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు, లీటరు నీటికి, స్ట్రెప్టోమైసిన్ 1 గ్రాము.. లీటరు నీటిలో కలిపి కాయకు తగిలేలా పిచికారి చేయాలి.

● డాక్టర్ రాఘవేంద్ర, ప్రధాన శాస్త్రవేత, కృషి విజ్ఞాన కేంద్రం

డెంగీతో బాలుడు మృతి

గోనెగండ్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లలో నరహరి(2) అనే బాలుడు శుక్రవారం డెంగీతో మృతిచెందాడు. బంధువులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన లక్ష్మి, చిన్నరంగన్న దంపతుల కుమారుడు నరహరి. వారం రోజులుగా అతడికి జ్వరం వస్తుంది. దీంతో స్థానిక ప్రైవేటు వైద్యుల దగ్గర చికిత్సచేయించారు. జ్వరం తగ్గకపోవడంతో రక్తపరీక్షలు చేయించగా డెంగీ అని నిర్ధారణ అయ్యింది. వైద్యం కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక బాలుడు మృతి చెందాడు. ఇదిలా ఉండగా ఏడాది కాలంలో మండలంలోని పలు గ్రామాల్లో 13 డెంగీ కేసులు నమోదయ్యాయి. హెచ్‌కైరవాడి, చిన్నమరివీడు, వేముగోడు, కులుమాల, పెద్దమరివీడు, గంజహళ్లి, అయ్యకొండ, గోనెగండ్ల గ్రామాల్లో డెంగీ కేసులు నమోదైనట్లు వైద్యులు తెలిపారు.

పొలాల్లో జింక మృతి

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరివరం గ్రామ మంగలదాని కుంట సమీపంలో మృతి చెందిన జింకను స్థానికులు గుర్తించారు. శుక్రవారం కుక్కలు జింకను తింటుండగా స్థానికులు కుక్కలను తరిమివేశారు. అయితే ఈ జింక సూడితో ఉండి పిల్ల జింకను ప్రసవిస్తూ మృతి చెందిందా.. లేక కుక్కల దాడిలో మృతి చెందిందా అన్నది తెలియాల్సి ఉంది. అటవీ శాఖ అధికారులు స్పందించి జింకలకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

ఓర్వకల్లులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలి

● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



కల్లూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సభ, అలాగే సీఎం చంద్రబాబు దృష్టికి తెచ్చారు. శుక్రవారం ఆమె అసెంబ్లీలో మాట్లాడుతూ చదువుకున్న యువతీ, యువకుల్లో నైపుణ్యం పెంచేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 2014-19లో సీఎం చంద్రబాబు పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లును ఇండస్ట్రియల్ హబ్‌గా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. అందులో భాగంగానే కేవలం 18 నెలల్లో ఓర్వకల్లులో విమానాశ్రయం పూర్తి చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఓర్వకల్లులో రూ.1800 కోట్లతో ఎలక్ట్రిక్ వెహికల్, 80 ఎకరాల్లో రూ.1600 కోట్లతో రిలయన్స్ బేవరేజెస్, రిలయన్స్ కన్జుమర్ పరిశ్రమలను తీసుకువచ్చామని, దాదాపు 1700 మందికి ఉద్యోగాలు 80శాతం మహిళలకే వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు.

రక్ష హాస్పిటల్ సీజ్

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ చేసి ఓగర్భిణి మరణానికి కారణమైన రక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను శుక్రవారం రాత్రి సీజ్ చేశారు. కలెక్టర్ సిరి ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ, డీఐవో డా.నాగప్రసాద్, కల్లూరు ఆర్ఐ రంగస్వామి, వీఆర్వో ఖాదర్ బాషా, నాలుగో పట్టణ పోలీసులు పంచనామా నిర్వహించారు. జూలై 30వ తేదీ పగిడ్యాలకు చెందిన గర్భిణి శ్రీవాణికి నందికొట్కూరులోని ఓఆర్‌ఎంపీ అబార్షన్ చేయగా వికటించి మరణించింది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన ఈఘటనపై కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పీసీపీఎన్‌డీటీ జిల్లా సలహా కమిటీ విచారణచేసి నివేదికను అప్పటి కలెక్టర్‌కు అందజేశారు. ఈ సంఘటన జరిగిన రెండు నెలలవుతోంది. కొత్తగా వచ్చిన కలెక్టర్ ఏ.సిరి గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించి శ్రీవాణి మృతికి కారణమైన రక్ష హాస్పిటల్‌ని తక్షణమే సీజ్ చేయాలని ఆదేశించారు. ఆమె ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో, డీఐవో, డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, లీగల్ కన్సల్టెంట్ సుమలత, కల్లూరు ఆర్ఐ, వీఆర్వో, ఫోర్త్ టౌన్ పోలీసులు రాత్రి సీజ్ చేశారు.



రక్ష హాస్పిటల్‌ను సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌వో, కల్లూరు రెవెన్యూ, పోలీసులు

పర్యాటకం.. అంతంతే..!

● పర్యాటకాభివృద్ధి ప్రతిపాదనలకే పరిమితం

● నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



అభివృద్ధికి నోచుకోని సంగమేశ్వరాలయం

ఆత్మకూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి కాగితాలకే పరిమితమైంది. చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించేలా ఏపీ పర్యాటక, దేవదాయ శాఖలు గత ఏడాది ఏడు టూరిజం సర్క్యూట్లను ఏర్పాటు చేసేందుకు అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలోనే ఏకైక సరస్వతి ఆలయంగా పేరుగాంచిన కొలనుభారతి క్షేత్రం, ఐతిహాస చారిత్రాత్మక నేపథ్యం కలిగిన సప్తనదుల సంగమేశ్వర క్షేత్రాన్ని ఏ సర్క్యూట్‌లో కూడా చేర్చకుండా విస్మరించారు. సర్క్యూట్ పేరుతో ఆయా టూరిజం కేంద్రాలను అనుసంధానం చేశారే తప్ప ఆతర్వాత వాటి ఊసే లేకుండా పోయింది. దీంతో ఆయా ప్రాంతాల్లో పర్యాటక రంగంలో ఆశించిన ఫలితాలు రాలేదని స్పష్టమవుతోంది. గత ఏడాది నవంబరు 9న శ్రీశైలానికి సముద్ర విమాన సేవలను ప్రారంభించారు. ఆతర్వాత అప్పటి నుంచి నేటి వరకు ఆ సేవలు పునరుద్ధరించబడలేదు.

బైర్లూటి ఎకో టూరిజం కేంద్రం ఓ మైలురాయి

పర్యాటకరంగం అభివృద్ధిలో బైర్లూటి ఎకో టూరిజం కేంద్రం ఓ మైలురాయి అని చెప్పవచ్చు. ఇందుకు కారణం స్వచ్ఛతే. 2017 మే 10వ తేదీన బైర్లూటి సమీపంలో నిర్మించిన ఏకోటూరిజం కేంద్రానికి విదేశాల నుంచి యాత్రికులు తరలివస్తున్నారు. నల్లమల పచ్చని అందాలతో పాటు కాటేజీలు, ఆహార పదార్థాలు, ఆహ్లాదకర వాతావరణం, జంగిల్ సఫారీ పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేస్తోంది. చెంచుల జీవనానికి ఆర్థికంగా తోడ్పాటునందిస్తోంది.

ప్రతిపాదనలు సిద్ధం చేశాం..

నంద్యాల జిల్లా పరిధిలో పర్యాటక రంగం అభివృద్ధికి అనేక ప్రతిపాదనలను సిద్ధం చేశాం. ప్రత్యేకించి సున్నిపెంటలో 50ఎకరాల స్థలంలో ప్రైవేట్, పబ్లిక్ భాగస్వామ్యంతో హోటల్స్, వసతి తదితర సదుపాయాలను కల్పించాలని నిర్ణయించాం. సంగమేశ్వరం వద్ద నిర్మితం కానున్న తీగల వంతెన నిర్మాణాన్ని దృష్టిలో ఉంచుకుని అక్కడ 10ఎకరాల భూమిని సేకరించాం. అహోబిలంలో స్వదేశీ దర్శన్2.0 పేరిట రూ.25కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులను చేపడుతున్నాం.

● నాగార్జున, ఏవో, జిల్లా టూరిజం ఆఫీస్, నంద్యాల:

దరఖాస్తుల గడువు పొడిగింపు

కర్నూలు లీగల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవడానికి అక్టోబరు 7వ తేదీ వరకు పొడిగించారు. ఈమేరకు జిల్లా ప్రధాన న్యాయాధి కారి జి.కబర్ధి, న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తుదారుల అభ్యర్థన మేరకు అక్టోబరు 7వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగించామన్నారు.

జీఎస్టీ తగ్గింపు వినియోగదారులకు చేరాలి

ఓర్వకల్లు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపును వినియోగదారులకు అందించడం వ్యాపారుల నైతిక బాధ్యత అని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్


మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

అన్నారు. శుక్రవారం హుశేనాపురం గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రధాని మోదీ జీఎస్టీ స్లాబులు తగ్గించడంతో దేశ ఆర్థికరంగం పరుగులు పెడుతుందన్నారు. మహబూబ్ బాషా, కేవీ మధు, బజారు, వేణు, వడ్డె నారాయణ ఉన్నారు.

కనకదాసు జిల్లాగా ప్రకటించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆదోనిని కనకదాసు జిల్లాగా ప్రకటించాలని కురువ సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తికొండ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో మాట్లాడుతూ తాము చేసిన తీర్మానాన్ని సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎంపి బస్తిపాటి నాగరాజు, ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, కమిటీ సభ్యులకు పంపామన్నారు. ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి మాట్లాడుతూ నామినేట్ పదవుల్లో కురువలకు అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గుడిసె శివన్న, శ్రీలీలమ్మ, పెద్దపాడు ధనుంజయ, జిల్లా కోశాధికారి కేసీ నాగన్న, తౌడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాసులు

గల్లంతైన మృతదేహం లభ్యం

కర్నూలు క్రైం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్‌లో గురువారం గల్లంతైన విద్యార్థి అశోక్ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. వివరాల మేరకు.. శుక్రవారం ఉదయం అయ్యప్ప స్వామి ఆలయం వద్ద కేసీ కెనాల్‌లో మృతదేహం కొట్టుకుపోతుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు బయటకు తీసి మార్చురికి తరలించారు. కాగా గల్లంతైన మరో విద్యార్థి ప్రశాంత్ మృతదేహం కోసం గాలిస్తున్నారు.

● కలెక్టర్ సిరి మృతుడు అశోక్ కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. గల్లంతైన మరో విద్యార్థి ప్రశాంత్ కోసం గాలిస్తున్నామన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు.

నవరాత్రి వైభవం

● ఐదో రోజు స్కందమాతగా అలంకరణ, కొనసాగుతున్న ఉత్సవాలు


లలితాపీఠంలో భజన చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో దసరా దేవీ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఐదో రోజు శుక్రవారం స్కందమాతగా పూజించారు. మించిన్ బజార్ పెద్ద అమ్మవారిశాలలో ఉదయం విఘ్నేశ్వర పూజతో వేడుకలు ఆరంభించారు. పుణ్యావచనం, పంచగవ్యం, శ్రీచక్రార్చన, శ్రీవాసవీదేవికి ఉపనిషత్తులతో అర్చన, అభిషేకం, నూతన వస్త్రాలంకరణ, లక్ష కుంకుమార్చన, హోమం, మంగళహారతి నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు చండికా దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పూలబజార్‌లోని చిన్న అమ్మవారిశాలలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం చండి సప్తశతి పారాయణము, దేవీ భాగవత పారాయనం చేశారు. సాయంత్రం అమ్మవారికి ధనలక్ష్మి దేవి అలంకరణ చేశారు. సప్తగిరినగర్ అయ్యప్పస్వామి ఆలయం ఆవరణలో ఉన్న చౌడేశ్వరి మాతా గుడిలో అమ్మవారు శ్రీ ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేశారు.


కర్నూలులోని బుధవారపేటలో..


కర్నూలులోని వడ్డేగేరిలో..

పంట రుణాల లక్ష్యాలను సాధించాలి

● బ్యాంకర్లకు సూచించిన కలెక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పంట రుణాల మంజూరులో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ సిరి బ్యాంకు అధికారులను సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ, డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చెందే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఎంఎస్‌ఎంఈలను ఎక్కువగా ప్రోత్సహించడంలో జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉండే విధంగా రుణాలు ఇవ్వాలన్నారు. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్టక్చర్ టర్మ్ లోన్లు ఇవ్వడంలో పురోగతి తక్కువగా ఉందని, కోల్డ్‌స్టోరేజ్, రూరల్ గోడౌన్ ప్రతిపాదనలు ఉంటే బ్యాంక్ అధికారులకు పంపించాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, కెనరా బ్యాంక్ రీజనల్ మేనేజర్ సుశాంత్ కుమార్ పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం


మాట్లాడుతున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలోని అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాలని కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. శుక్రవారం ఎస్‌టీబీసీ కాలనీలోని సమావేశభవనంలో పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు, సిబ్బందితో కలిసి ఓపెన్ ఫోరం నిర్వహించారు. అర్జీదారులు తమ సమస్యలను విన్నవించగా, జాప్యానికి కారణాలను అడిగి చట్టపరిధిలో సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయాల పరిధిలో ప్లానింగ్ కార్యదర్శి, ఇతర కార్యదర్శుల సాయం తీసుకుని అక్రమ నిర్మాణాలు గుర్తించాలన్నారు. అనుమ తి ఉందా, ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించారా అన్నవి నిశితంగా పరిశీలించాలని సూచించారు. ప్లాన్‌కు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలకు నోటీసులు జారీ చేసి, చార్జిషీట్ దాఖలు చేయాలని స్పష్టం చేశారు. అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్‌ఆర్‌ఎస్) పథకంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డీసీపీ వెంకటరమణ, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్‌బాషా, సూపరింటెండెంట్ సుబ్బన్న, తదితరులు పాల్గొన్నారు.

ఓపీ 222లో క్యాన్సర్‌కు చికిత్స

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఓపీ నెంబర్ 222లో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు, అనుమానితులకు వైద్యసేవలు అందిస్తున్నట్లు రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ సమన్వయకర్త డా.మహేశ్వర్ ప్రసాద్ అన్నారు. నగరంలోని ముజఫర్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో డీపీఎంవో డా.ఉమతో కలిపి పోస్టర్‌ను ఆవిష్కరించారు. బాల్య వివాహాలు, అపరిశుభ్రత, అబార్షన్, ఇతరత్ర కారణాలతో గర్భాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని, ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే ముప్పు నుంచి తప్పించుకోవచ్చన్నారు. డీపీఎంవో డా.ఉమ మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు స్వాస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌ను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యురాలు డా.రోషిణి, డీపీవో విజయరాజు, కన్సల్టెంట్ సుధాకర్, ఖలీల్ పాల్గొన్నారు.


పోస్టర్‌ను విడుదల చేస్తున్న డా.మహేశ్వరప్రసాద్

కల్లూరులో 20,660 స్మార్ట్ రేషన్ కార్డులు

కల్లూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలానికి 20,660 స్మార్ట్ రేషన్‌కార్డులు వచ్చాయని తాసీల్దార్ కె.ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్డులను త్వరలోనే పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేస్తామన్నారు. డీలర్లు సరుకులను గడువులోపు పంపిణీ చేయాలని ఆదేశించారు.

అత్యవసర సేవలకు డయల్ 112

● నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ విక్రాంత్ పాటిల్



కర్నూలు క్రైం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సేవలకు జిల్లా ప్రజలు 112కు కాల్ చేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ప్రభుత్వం 100 స్థానంలో డయల్ 112ను తీసుకువచ్చిందని ఇక ముందు ఈ నెంబర్‌కే ఫోన్ చేయాలన్నారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, కుటుంబ తగాదాలు, సమస్యలు ఉంటే సమాచారం అందించాలన్నారు. కాల్ వచ్చిన వెంటనే బ్లూకోల్ట్స్, రక్షక్ దళాలు 15 నిమిషాల వ్యవధిలో ఘటనాస్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు, చెరవులు నిండాయని, నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సెలవుల నేపథ్యంలో పిల్లలు ఈతకు వెళ్లి, ప్రమాదాల బారిన పడే అవకాశముందని, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు.


బస్సు యాత్రకు స్వాగతం పలుకుతున్న ప్రతినిధులు

పెట్టుబడుల కోసం యాత్ర

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోని 8 నగరాల్లో పెట్టుబడిదారులకు అవగాహన కల్పించడమే లక్ష్యమని వివేష్ అన్నారు. తాము అనంతపురం, తిరుపతి, నెల్లూరు, గుంటూరు, విజయవాడ, విశాఖ మీదుగా ప్రయాణించి శుక్రవారం కర్నూలుకు చేరామన్నారు. ప్రతి నగరంలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. కెనరా రోబెకో అశోక్ మేనేజెమెంట్ అధికారి రజనీష్ నూరుల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. పెట్టుబడిదారులను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నా నని తెలిపారు. అపోహలుత తొలగించి, విశ్వాసాన్ని పెంపొందించి చైతన్యవంతులను చేయడం, పరిశ్రమలు, సంస్థల ఏర్పాటుతో యువతకు ఉపాధి కల్పించాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు.

తాళం వేసివున్న ఇంట్లో చోరీ

సి.బెళగల్, సెప్టెంబరు26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనదొడ్డి గ్రామంలో తాళం వేసి వున్న ఇంటిలో చోరీ చోటుచేసుకుంది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన తెలుగు చిన్నారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి, రాజోళి మండలం పెద్దధన్వాడకు వెళ్లారు. సాయంత్రం వచ్చి చూడగా తాళం పగలగొట్టి పెట్టెలో ఉన్న రూ.1.30 లక్షలు, మూడున్నర తులాల బంగారం, 60 తులాల వెండి చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పరమేష్‌నాయక్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి ఉమాదేవి డిమాండ్ చేశారు. శుక్రవారం పీడీ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. బకాయిపడ్డ 6 నెలల వేతనాలు చెల్లించాలన్నారు. జీతాలు లేక కుటుంబాలు గడవడం కష్టంగా ఉందన్నారు. పి.రుద్రమ్మ, ఎస్.షబానా, సుజాతప్రసాద్, సుజాత, నాగమణి పాల్గొన్నారు.


పీడీకి వినతి పత్రం అందజేస్తున్న ఆర్పీలు

ముప్పు



కర్నూలు మార్కెట్ యార్డు ప్రధాన గేటు వద్ద కల్వర్టు ధ్వంసమై గొయ్యి ఏర్పడిది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అకాశం ఉంది. పంట ఉత్పత్తులు తెచ్చే రైతులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం కలెక్టర్, జేసీ, ఇతర ఉన్నతాధికారులు ఈ దారిలో వెళుతుంటారు. అధికారులు స్పందించి, గొయ్యిని పూడ్చాలని రైతులు కోరుతున్నారు. - కర్నూలు అగ్రికల్చర్

పొలంలో నీరు



భారీ వర్షాల కారణంగా మండంలోని వరి, మొక్కజొన్న, పత్తి పొలాల్లో నీరు నిలిచింది. రైతులు నీటిని బయటకు పంపి, తేమను తట్టుకునేందుకు 1919 రకం మందును పిచికారీ చేయాలని ఏవో మధుమతి సూచించారు. - ఓర్వకల్లు

లీకేజీ



తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. పైకప్పు పెంకులతో ఉండటంతో చిన్న వర్షం వచ్చినా నీరు లీకేజీ అవుతోంది. సిబ్బంది కంప్యూటర్లు, రికార్డులపై ప్లాస్టిక్ కవర్లు కప్పుతున్నారు. నూతన భవనం నిర్మించాలని సిబ్బంది కోరుతున్నారు. - గూడూరు

వర్షంలోనూ కొనసాగిన దీక్షలు


దీక్షలో పాల్గొన్న న్యాయవాదులు

కర్నూలు లీగల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు వర్షాన్ని ఖాతరు చేయకుడా నిరాహారదీక్షలను కూడా కొనసాగించారు. శుక్రవారం వివిధ సంఘాల నాయకులు జేవీ కృష్ణయ్య, అయ్యన్న యాదవ్, రేపల్లె సూర్యచంద్ర శిబిరాన్ని సందర్శించారు. దీక్షలో న్యాయవాదులు కృష్ణమూర్తి, నాగరాజు, రామాంజనేయులు ఉన్నారు.


మైక్రో బయాలజీకి ఎన్‌ఏబీఎల్ గుర్తింపు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేఎంసీ మైక్రోబయాలజీ విభాగం హెచ్‌ఐవీ ల్యాబ్‌కు ప్రతిష్టాత్మక ఎన్‌ఏబీఎల్ గుర్తింపు లభించింది. శుక్రవారం ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ మైక్రోబయాలజీ హెచ్‌వోడీ డా.రేణుకాదేవిని అభినందంచారు. హెచ్‌వోడీ డా.రేణుకాదేవి మాట్లాడుతూ హెచ్‌ఐవీ పరీక్షలకు ఎన్‌ఏబీఎల్ మార్గదర్శకాల ప్రకారం అత్యంత ఖచ్చితత్వంతో పరీక్షలు నిర్వహించే వారికి ఈ గుర్తింపు లభిస్తుందన్నారు. ఎన్‌ఏబీఎల్ అక్రిడేషన్ ఐఎస్‌వో 151822:2022 గుర్తింపు రావడం అంటే మైక్రోబయాలజీ పనితీరుకు నిదర్శనమన్నారు.


ప్రిన్సిపాల్‌తో వైద్యులు, సిబ్బంది

రామాంజనేయులుకు సాహిత్య పురస్కారం

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన బాల సాహిత్యవేత్త రామాంజనేయులు హైదరాబాద్‌లోని 'డాక్టర్ వేదిగిరి రాంబాబు సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. ఈమేరకు శుక్రవారం కన్వీనర్ సింహప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సాహిత్య రంగంలో విశేష కృషి చేసిన వారికి ఇస్తామన్నారు. అక్టోబరు 14న రవీంద్రభారతిలో ప్రదానం చేస్తారన్నారు.



డిప్యూటీ సీఎంను విమర్శించే స్థాయి సిద్దార్థ రెడ్డికి లేదు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను విమర్శించే స్థాయి వైసీపీ నాయకుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి లేదని జనసేన కోడుమూరు నాయకుడు వై. వెంకటరాముడు అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ పవన్‌కు చిరంజీవి అంటే ఎంతో గౌరవమని, జనసేన కార్యకర్తలు వైసీపీలాగా ప్రలోభాలకు లొంగరన్నారు.


వెంకటరాముడు

వాల్మీకి జయంతిని నిర్వహిద్దాం

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 7న వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహిద్దామని వాల్మీకి జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపునిచ్చింది. శుక్రవారం జేఏసీ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. వాల్మీకి జయంతిని కర్నూలులో నిర్వహించాలని ప్రభుత్వానికి నాయకులు విజ్ఞప్తి చేశారు. నగరంలో వాల్మీకి భవనం ఏర్పాటు చేయాలని కోరారు. మహేష్ నాయుడు, కుబేరస్వామి, బేతం కృష్ణుడు, కృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.


పాల్గొన్న వాల్మీకి సంఘం నాయకులు

రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండో స్థానం


ఆట్యా పాట్యా క్రీడాకారులతో అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25 నుంచి 26 వరకు పల్నాడు జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల ఆట్యా పాట్యా పోటీల్లో జిల్లా జట్టు రెండో స్థానంలో నిలిచిందని సంఘం సీఈవో నాగరత్నమయ్య తెలిపారు. లీగ్ దశలో ప్రతిభ చూపి ఫైనల్‌కు చేరి, పోరాడి ఓడిందన్నారు. కోచ్ చరణ్, పీఈటీ వెంకటలక్ష్మి ఉన్నారు.

అధ్వానంగా ఆలూరు-పెద్దహోతూరు రహదారి



గుంతలమయంగా మారిన ఆలూరు-పెద్దహోతూరు రహదారి

ఆలూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలకు ఆలూరు-పెద్దమోతూరు మీదుగా కర్నూలు వెళ్లే ప్రధాన రహదారి గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంగుండా నిత్యం బళ్లారి, కర్నూలుకు వాహనాలు వెళ్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం నీరు గుంతల్లో నిల్వ ఉండడంతో వేగంగా వస్తున్న వాహనాలు ఒక్కసారిగా గుంతలు ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు నిర్మాణం కోసం రూ.3 కోట్లు మంజూరయ్యాయని టెండర్లు పూర్తి చేసి పనులు చేపడతామని ఆర్అండ్ బీ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్

ఆలూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డా.సిరి సూచించారు. శుక్రవారం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రోగులతో మాట్లాడారు. వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలపై తెలుసుకున్నారు. మందులు సరైన సమయానికి ఇస్తున్నారా? వైద్యులు బాగానే స్పందిస్తున్నారా? ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని కలెక్టర్ పేషెంట్‌లను అడిగి తెలుసుకున్నారు. ప్రసవ విభాగాన్ని కలెక్టర్ పరిశీలించారు. పుట్టిన పిల్లలను బాగా చూసుకోవాలని, సరైన సమయానికి భోజనం అందిస్తున్నారా? అని బాలింతలను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనాన్ని రెండేళ్లుగా ఎందుకు ఆరంభించలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్, తహసీల్దార్ శోభాసువర్ణమ్మ, డీటీ విజయ్‌కుమార్, ఎంఈవో కోమలదేవి, ఆర్‌ఐ బసవన్నగౌడ్ పాల్గొన్నారు.

జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించాలి

జీఎస్టీ పన్నుల తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సిరి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఆలూరు గ్రామ సచివాలయం-2ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతుంటాయని, వాటిని అరికట్టేందుకు కృషి చేయాలని సూచించారు. ఆడపిల్లలకు విద్యపైన అవగాహన కల్పించి, చదువుకునేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.



ఆసుపత్రిలోవైద్య సేవలగురించి తెలుసుకుంటున్న కలెక్టర్ డా.సిరి

మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు



కన్యకాపరమేశ్వరి ఆలయంలో ధన లక్ష్మిదేవిగా అమ్మవారు



మహాలక్ష్మి అలంకరణలో కొలువైన..

మద్దికెర సెప్టెంబరు26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దికెర, పెరవలి గ్రామంలో శ్రీ రంగనాథస్వామి, నగరేశ్వరస్వామి, చౌడేశ్వరి దేవి ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా రాజ్యలక్ష్మిదేవి అమ్మవారు, చౌడేశ్వరిదేవీని శుక్రవారం విజయవాడ కనకదుర్గమ్మ, మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అంతకుముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వహకులు వీరయ్య, ముత్యాల రాజశేఖర్, సుంకు రవి, పెద్ద కోట రమేష్ ఉన్నారు.

అమ్మవారికి కాసుల హారం, జడపట్టు విరాళం :మద్దికెర గ్రామంలోని నగరేశ్వరస్వామి దేవాలయంలో వెలసిన పార్వతిదేవి అమ్మవారికి గురువారం గుంతకల్లు పట్టణానికి చెందిన దివంగత సుంకు పంపావతి జ్ఞాపకార్థం ఆయన భార్య శారద, కుమారులు సుంకు సందీప్ రూ.లక్ష విలువ చేసే కాసుల హారం, వెండి జడపట్టును విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో మెడికల్ వీరేష్, మెడికల్ కాశీ విశ్వనాథ్, సుదర్శన్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: శరన్నవరాత్రులలో భాగంగా ఐదవ రోజు అమ్మవారు ధనలక్ష్మిదేవిగా దర్శనమిచ్చారు. ఆలయాలల్లో ఉదయం పంచామృత అభిషేకం, అష్టోతర నామవలి, సహస్రనామవలి, నక్షతహరతి కార్యక్ర మాలతో అమ్మవారు పూజలందుకున్నారు. మండలంలోని పలు గ్రామాలు, దేవనకొండలోని కన్యకపరమేశ్వరీ ఆలయం, సుంకులాపరమేశ్వరి ఆలయాలలో అమ్మవారు ధనలక్ష్మి దేవిగా దర్శనమిచ్చారు.



ఆలూరులో కామేశ్వరిదేవి అలంకరణలో..



ఆస్పరిలో పూజలందుకున్న గాయత్రీమాత..

ఆస్పరి:మండల కేంద్రమైన ఆస్పరి సమీపంలో రామతీర్థ క్షేత్రంలో కొలువుదీరిన గాయత్రిమాత శుక్రవారం లక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. శరన్నవరాత్రుల్లో భాగంగా లక్ష్మీదేవి దర్శనమిచ్చారు. ఈనెల 22 నుంచి ప్రారంభమైన శరన్నవరాత్రులు దసరా పండగతో ముగుస్తాయని ఆలయ నిర్వాహకులు రూపామోహన్ తెలిపారు.


ఆలూరు రూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో శ్రీ కామేశ్వరిదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారుకార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జనార్ధన్‌శెట్టి, భాస్కర్‌శెట్టి, సభ్యులు విశ్వనాథ్‌శెట్టి, రవి, సుబ్బయ్యశెట్టి, నాగేంద్రశెట్టిపాల్గొన్నారు.



మహాలక్ష్మీ అలంకరణలో వాసవీమాత

ఆదోని: పట్టణంలోని నగరేశ్వరస్వామి గుడిలో వెలిసిన వాసవీమాత శుక్రవారం పసుపు, కుంకుమలతో అలంకరించిన మహాలక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చింది.







పారిశుధ్య కార్మికులతో స్వామిత్వ సర్వేలు

హొళగుంద, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మార్లమడికి గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య విధులు నిర్వహించాల్సిన క్లాప్ మిత్ర (పారిశుధ్య కార్మికులు) ఇంటింటికి తిరుగుతూ స్వామిత్వ సర్వేలు చేస్తున్నట్లు గ్రామ కార్యదర్శి ఇష్ట రాజ్యాంగా వ్యవహరిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ విషయంపై డిప్యూటీ ఎంపీడీవో చక్రవర్తిని వివరణ కోరాగా క్లాప్ మిత్ర సభ్యులతో సర్వేలు చేయించరాదని ఒకవేళ చేయిస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటానని తెలిపారు

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి

తుగ్గలి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి చేయాలని ఎంపీడీవో విశ్వమోహన్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీహరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన తుగ్గలి ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సలహాదారులు పాల్గొన్నారు

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మద్దికెర సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ద వహించాలని ప్రభుత్వ వైద్యాధికారిణి రాగిణి, ఎంపీపీ అనిత, సర్పంచ్ బండారు సుహాసిని అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయ ఆవరణంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డెంగ్యూ, మలేరియా, క్షయ, క్యాన్సర్ వ్యాధులపై అనుమానం ఉన్న వెంటనే వైద్యపరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి శివకుమార్, ఆంజనేయులు, లక్ష్మినారాయణ, బాలచంద్ర, చంద్రశేఖర్‌గౌడు ఉన్నారు.

స్వామిత్వ సర్వేను పూర్తి చేయాలి

మద్దికెర సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న స్వామిత్వ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపైనే ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శివకుమార్, హరిక్రిష్ణ, సుధాకర్, పరమేశ్వరప్ప, మల్లికార్జున, మంజునాథ్ తదితరులు ఉన్నారు.

ఉత్తమ మార్కెట్ యార్డ్‌గా తీర్చిదిద్దుతాం



విజయవాడలో ఎమ్మెల్యే పార్థసారథిని కలిసిన బీజేపీ నాయకులు

ఆదోని టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాయలసీమలోనే అతిపెద్ద అగ్రికల్చరల్ మార్కెట్ యార్డ్‌గా పేరు పొందిన ఆదోని మార్కెట్ యార్డును రాష్ట్రంలోనే ఉత్తమ మార్కెట్ యార్డ్‌గా రూపొందిస్తామని వైస్ ఛైర్మన్‌గా ఎంపికైన బీజేపీ నాయకుడు విజయ్ కృష్ణ అన్నారు. అక్టోబర్ 4వ తేదీన కార్యక్రమానికి ఆహ్వానించామని ఆయన తెలిపారు మార్కెట్ యార్డుకు ఒక వైస్ ఛైర్మన్‌తో పాటు నాలుగురు డైరెక్టర్లను బీజేపీకు చెందిన వారికి అవకాశం కల్పించడం జరిగిందని రైతు సమస్యలపై పరిష్కారం కోసం కూటమి నాయకులతో కలిసి కృషి చేయాల్సిందిగా ఆయన సూచించినట్లు విజయ కృష్ణ తెలిపారు. యువ మోర్చ మాజీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస ఆచారి, బీజేపీ మాజీ జిల్లా కార్యదర్శి రమాకాంత్ పాల్గొన్నారు.

సౌకర్యాలు లేక ప్రయాణికుల ఇబ్బందులు

ఆదోని టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొత్త ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం సౌకర్యాలు కల్పించని కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిగిరి టీడీపీ ఇన్‌చార్జి శ్రీనివాసాచారి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను శుభ్రం చేయకపోవడంతో వీటిని వినియోగించుకొనే పరిస్థితి లేదన్నారు. ప్రయాణికులు వారి సామానుల భద్రత కోసం బస్టాండ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమస్యలను డిపో మేనేజర్ రఫిక్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చారు.

ఆదోనిలో ఎడతెరిపిలేని వర్షం



ఆదోని తిరుమల్ నగర్ వద్ద నిలిచిన వర్షపు నీరు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆదోని నియోజకవర్గంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. తుఫాను ప్రభావం వల్ల కురుస్తున్న వర్షానికి చిరు వ్యాపారాలు, కార్యాలయానికి వేళ్లే వారు ఇబ్బందులు పడ్డారు. వర్షం రావడంతో రోడ్లు జలమయమయ్యాయి. వాగులు పొంగాయి. పంట ఉత్పత్తులు మార్కెట్ యార్డ్‌కు విక్రయానికి తీసుకురావడానికి రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం పంట పొలాలకు తీవ్రంగా నష్టం కలిగిస్తుందని రైతులు వాపోతున్నారు. పత్తి పంట కాయలు పూతరాలి తెగుళ్ల సోకే ప్రమాదం రైతులు ఆందోళన చెందుతున్నారు.

'వీరవనిత చాకలి ఐలమ్మ'

హొళగుంద, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీర వనిత చాకలి ఐలమ్మ అని రజక సంఘం నాయకులు సన్నైర్ నాగరాజు, లక్ష్మన్న, మల్లికార్జున, చాకలి నాగరాజు శుక్రవారం అన్నారు. స్థానిక మడివాల మాచ్చయ్యగుడి అవరణంలో 130వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దొరల పెత్తనాన్ని ఎదిరించిన ధీరశాలి చిట్యాల ఐలమ్మ అని రజకార్లను తరిమికొట్టిన వీర వనిత అని కొనియాడారు. అనంతరం చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కరెంటు మల్లి, యశ్వంత్, వీరన్న పాల్గొన్నారు.

పత్తి ధరలు పతనం

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి ధరలు రోజురోజుకి పతనమయ్యాయి. శుక్రవారం పత్తి ధర క్వింటాలు గరిష్టంగా రూ. 7352 కి పడిపోయింది. గత వారంతో పోల్చితే క్వింటానికి రూ. 400 పైగా ధర తగ్గింది. దసరా పండుగ ముందు పత్తి ధరలు పతనమవుతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కొత్త పత్తి చేతికందడంతో విక్రయానికి భారీగా తీసుకొస్తున్నారు. రైతులు గ్రామాల నుంచి కోతకోసి పత్తిని నేరుగా ఆరబెట్టకుండా తేమతోనే విక్రయానికి తీసుకొస్తుండడం వల్ల ధర తగ్గడానికి కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు. 8356 క్వింటాళ్ల పత్తి విక్రయానికి తీసుకురాగా వాటి కనిష్ట ధర రూ. 3960. మధ్యధర రూ. 7199, గరిష్ట ధర రూ.7352 పలికింది.

ఈకేవైసీని వేగవంతం చేయాలి

తుగ్గలి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలందరి ఈకేవైసీ వేగవంతం చేయాలని ఉపాధి ప్రత్యేక అధికారి సురేష్‌బాబు, ఎంపీడీవో విశ్వమోహన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన తుగ్గలి, మద్దికెర ఉపాధి సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏపీవో హేమసుందర్, ఈసీ రాజశేఖర్, టీఏలు ప్రదీప్, రామకృష్ణ ఉన్నారు.

జీఎస్టీ సేవింగ్స్ ఫలాలు అందరికీ అందాలి

వెల్దుర్తి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ ఫలాలు అందరికి అందాలని ఎంపీడీవో సుహాసినమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో, తహసీల్దార్, ఎంఈవో, డిప్యూటీ ఎంపీడీవో, ఎస్ఐ, మెడికల్ ఆఫీసర్, అగ్రికల్చర్ ఏవో, ఏపీవో, ఏపీఎంలతో కూడిన జీఎస్టీ మండల కమిటీ ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎమ్మార్వో చంద్రశేఖరవర్మ, డిప్యూటీ ఎంపీడీఓ రవికిశోర్ పాల్గొన్నారు.

ఆదోనిని జిల్లాగా ఏర్పాటు చేయాలి

ఆదోని, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆదోనిని జిల్లాగా ఏర్పాటు చేయడంతో పాటు పెద్దహరివాణం గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని ఏపీ కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, ఎమ్మెల్యే పార్థసారథి, ఆదినారాయణరెడ్డి శుక్రవారం అమరావతి అసెంబ్లీ ఆవరణలో ఏపీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాశ్రీనివాసయాదవ్, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, మంత్రి టీజీ భరత్, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌లకు వినతి పత్రం అందజేశారు.

మురుగు తొలగిస్తారా.. లేదా?

మద్దికెర సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్దికెర గ్రామంలో ఎన్నో ఏళ్లుగా మురుగుతో సావాసం చేస్తున్నామని, ఆ మురుగు తొలగిస్తారా లేదా అంటూ మాలవీధి కాలనీవాసులు అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం ఎంపీడీవో కొండయ్య, పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌తో కాలనీకి చెందిన యువకులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులపై వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మురుగు తొలగించాలంటే అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. మురుగుతో తమ వీధిలో జ్వరాలు, సీజనల్ వ్యాధులు వేధిస్తున్నాయని అన్నారు. అధికారులు స్పందిస్తూ నిధులు లేవని, పనులు మీరే చేయండంటూ తెలపడంతో ఆగ్రహించిన కాలనీవాసులు వాగ్వాదానికి దిగారు. ఇలా నిర్లక్ష్యం సమాధానం ఇవ్వడం ఎంత వరకు సమంజసమన్నారు. ఈ సమస్య పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఉన్నారు.

ఉల్లి రైతుల అకౌంటు నంబర్లు అందించాలి

తుగ్గలి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఉల్లి సాగు చేసిన రైతులందరూ ఈక్రాప్ నమోదు చేసుకుని అకౌంటు నంబర్లు వ్యవసాయాధికారులకు అందించాలని ఏవో సురేష్ యాదవ్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని తుగ్గలి, ఆయా గ్రామాల్లో ఆయన పర్యటించి మాట్లాడుతూ ఉల్లి సాగు చేసిన రైతులు ఈక్రాప్ నమోదు చేసుకుని ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని, వారి పొలాలకు సంబంధించి పాస్‌బుక్ జిరాక్స్, అకౌంటు నెంబర్ల జిరాక్స్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌ను ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఉన్న వ్యవసాయా సిబ్బందికి ఇవ్వాలన్నారు. వాటి జిరాక్స్ ఇవ్వకపోతే ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం అందదన్నారు.

డిజిటల్ రేషన్ కార్డులు వచ్చేశాయ్..

ఆదోని రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలానికి డిజిటల్ రేషన్ కార్డులు వచ్చేశాయ్. మండలంలోని 44గ్రామాల్లో దాదాపు 79,631 పాత రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటి స్థానంలో ప్రభుత్వం డిజిటల్ రేషన్ కార్డులను తీసుకొచ్చింది. ఈ సందర్భంగా శుక్రవారం తహసీల్దార్ రమేష్ మాట్లాడుతూ, 78,950 నూతన డిజిటల్ రేషన్‌కార్డులు వచ్చాయని, వీటిని నేటి నుంచి లబ్దిదారులకు ఇంటింటి కెళ్ళి సచివాలయ సిబ్బంది వారం రోజుల పాటు పంపిణీ చేస్తారన్నారు. నూతనంగా కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడ అందిస్తామన్నారు. .

పత్తికొండ టౌన్: పత్తికొండ మండలానికి సుమారు 800 రేషన్‌కార్డులు మంజూరయ్యాయని, వచ్చే నెల (అక్టోబర్) నుంచే కొత్త కార్డుదారులందరికీ రేషన్ పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ ఉసేన్‌సాహెబ్ తెలిపారు. కొత్తగా కార్డులు పొందిన వారందరికీ వచ్చే నెల నుంచి రేషన్ దుకాణాల్లో సరుకులు పొందవచ్చన్నారు.

వెల్దుర్తి:మండల కేంద్రమైన వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ శుక్రవారం కొత్త రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించారు. మండలానికి 19911 కొత్త రేషన్(స్మార్ట్) కార్డులు మంజూరయ్యాయని అన్నారు. మండలంలో ఉన్న సచివాలయాల ద్వారా లబ్దిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

బేగరుల సమస్యలు పరిష్కరించాలి

● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



ఎమ్మిగనూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని బేగరుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో శ్మశాన వాటికలు లేక పోవటంతో దహన సంస్కారాల సమయంలో బేగారుల ఆరోగ్యం దెబ్బతింటొందన్నారు. మృతదేహాలు ఖననం చేసే వృత్తులో 35వేల బేగారుల కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని, వారికి పెన్షన్ గాని, పారితోషికం గాని ఇవ్వడంతో పాటు ఆరోగ్య భద్రత కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ జయరాముడు, సబ్ ఇన్‌స్పెక్టర్ ఈగల్ సెల్ సుజన్ కుమార్ సూచించారు. పట్టణంలోని కెమిస్ట్ భవనంలో జరిగిన నార్కోటిక్ డ్రగ్స్, యాంటిబయోటిక్స్, సైకోట్రోపిక్ డ్రగ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల గురించి వారు వివరించారు. మాట్లాడుతూ డ్రగ్స్‌కు బానిస అయిన వారి గురించి తెలిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1972కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు మెడికల్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ కమిటీ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, సెక్రటరీ కృష్ణయ్య, ట్రెజరర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శాంతించని వరుణుడు

● ఎడతెరిపి లేని వర్షాలతో పొలాల్లో నీరు
● దెబ్బతిన్న పంటలు
● ఆందోళనలో అన్నదాతలు



గోనెగండ్లలో వేరుశనగ పంటలో నిలిచిన నీరు



శిరాలదొడ్డి గ్రామంలోని మిరప పంటలో..

ఎమ్మిగనూరు/ ఎమ్మిగనూరు రూరల్/ గోనెగండ్ల/ మంత్రాలయం/ కోసిగి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరుస వర్షాలు.. అన్నదాతకు ఆందోళన కలిగిస్తున్నాయి. వర్షపు నీరు నిల్వ ఉండడంతో పంటలు దెబ్బతింటున్నాయి. దీంతో ఈ ఏడాది కూడా నష్టం తప్పేలా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్ట పరిహారం అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఎమ్మిగనూరు మండలంలో..

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణితో శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. ఉదయం నుంచి ఏకదాటిగా వర్షం కురువటంతో జనం ఇళ్లనుంచి బయటకు రాకపోవటంతో రహదారులు ఖాళీగా కనిపించాయి. ఎడతెరిపి లేని వర్షంతో పంటపొలాల్లో నీరు నిలిచింది. ఎమ్మిగనూరు మండలంతో పాటు గోనెగండ్ల, నందవరం మండలాల్లో ఇదే పరిస్థితి. పంటపొలాల్లో వర్షం నీరు నిలిచిపోవటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎమ్మిగనూరు ప్రాంతంలో ప్రధానంగా పత్తి, వరి, మిరప, వేరుశనగ, సజ్జ, ఉల్లితో పాటు ఇతర పంటలను సాగుచేశారు. అయితే ఇందులో అత్యధికంగా పత్తిపంట సాగు చేశారు. ప్రస్తుతం పత్తి కాపుకొచ్చి కోసే సమయంలో వర్షం రావటంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కడివెళ్ల, కందనాతి, మసీదుపురం, మాస్‌మాన్‌దొడ్డి, కె.తిమ్మాపురం, ఏనుగు బాల, పెసలదిన్నె గ్రామాల్లోని వంకలు, వాగులు పొంగి పొర్లాయి.

గోనెగండ్లలో..

ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల సాగు చేసిన పత్తి, ఉల్లి, వేరుశనగ పంటకు తీవ్రనష్టం వాటిల్లితుంది. శుక్రవారం తెల్లవారుజామున కురిసిన వర్షం కారణంగా గోనెగండ్ల, ఐరన్‌బండ, ఎన్నెకండ్ల, వేముగోడు, గాజులదిన్నె, పిల్లిగుండ్ల, నెరుడుప్పల తదితర గ్రామాలో పాటు పలు గ్రామాలలో పత్తిపోలాలలో వర్షపునీరు నిలచిపోవడంతో పంట దెబ్బతింటుందని రైతులు ఆదోళన చెందుతున్నారు. ప్రస్తుతం పత్తి పంటకు కాయ, పూత పట్టింది. ఈ సమయంలో వర్షం కురియడం ఆకాశం మేఘాలు కమ్ముకొని ఉండటంతో పూత,కాయ రాలిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి పంట కాయ, పూత పట్టింది. ఈ సమయంలో వర్షం కురియడం, ఆకాశం మేఘావృతమై ఉండటంతో పట్టిన కాయ, పూత రాలిపోతుందని రైతులు తెలుపుతున్నారు. పత్తి, ఉల్లి వేరుశనగ పంటలు, తడిసిపోయి రైతులకు నష్టం కలుగుతుంది. వర్షం కారణంగా పత్తి పంట పొలాల్లో వర్షపు నీరు నిలవడంతో పంట కుళ్లిపోవడమే గాక వైరస్ సోకడంతో ఆకులు పసుపచ్చగా మరిపోతున్నాయి. దోమ, పేనుబంక కారణంగా పట్టిన కాయలు రాలిపోవడమేగాక పూత సైతం రాలిపోతుందని రైతులు తెలుపుతున్నారు. ఉల్లి పంటకు నీరు ఎక్కువ కావటంలో మజ్జిగ తెగులు సోకింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రసుత్తం వేరుశనగ పంట చేతి రావడంతో పంటను కోశారు. కోసిన పంటను పొలంలోనే ఉంచడంతో వర్షానికి పంట మొత్తం నానిపోయి వేరుశన గింజల నుంచి మొలకలు వచ్చే పరిస్థితి ఏర్పడింది. దీంతో మేత పశువులకు గ్రాసంగా కూడా పనికిరాదు. దీంతో వేరుశనగ రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఈ ఏడాది నియోజక వర్గంలో అన్ని పంటలు కలిపి లక్షన్నర ఎకరాలలో పంటలు సాగుచేశారు.

మంత్రాలయంలో..

మండలంలో భారీ వర్షం కురుస్తుండటంతో పత్తి, ఉల్లి పంటలకు అపార నష్టం జరిగింది. 20 రోజులుగా కురిసిన వర్షానికి పత్తి రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో ఏకధాటిగా వర్షం పడటంతో పత్తి, ఉల్లి పొలాల్లో నీరు చేరి రైతులకు తీరని నష్టంతో కన్నీరు పెట్టిస్తుంది. దీంతో సజ్జ, కొర్ర, వంటి పంటలకు సైతం నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోసిగిలో..

మండలంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి కోసిగితో పాటు అన్ని గ్రామాల్లోని పత్తి, ఉల్లి, వేరుశనగ రైతులకు భారీ నష్టం జరిగింది. ముఖ్యంగా చింతకుంటలోని పత్తి రైతులు అధిక వర్షాలకు నల్లగా మారిన పత్తికాయలను చూపిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి పత్తి పగిలి తీద్దామనుకునే సమయానికి అధిక వర్షాల వల్ల పత్తికాయలు నల్లగా మారి పత్తి కూడా తీయడానికి రాకుండా మారిందని, చింతకుంట గ్రామానికి చెందిన రైతులు జగ్గుల మల్లేష్, దాసరి నరసింహులు, మాన్వి నారాయణ, వెంకటరెడ్డి, నరసప్పలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కోసిగి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



మంత్రాలయంలో పత్తి పంటలో నీరు నిల్వ



చింతకుంటలో నల్లరంగులో మారిన పత్తికాయలు

యాజమాన్య పద్ధతులు పాటించాలి

గోనెగండ్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం అధిక వర్షాల వల్ల చేతికి అందే పంటలు దెబ్బతింటున్నాయని, ప్రతి రైతు తాము సాగు చేసిన పంటల పట్ల యాజమాన్య పద్ధతులు పాటించి పంటలను రక్షించుకోవాలని ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత సూచించారు. శుక్రవారం వర్షం నీటిలో మునిగిన పలు పంటలను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ పత్తి పంట నీట మునిగినప్పుడు ఆకులుఎర్రడటం, మొక్కలు వాడిపోవడం కాయలు కుళ్లి రాలిపోతాయని, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి స్వానిధి 2.0 పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి దయాసాగర్ సూచించారు. పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలోని బీజేపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఈ పథకం గురించి పూర్తి సమాచారం కోసం హెచ్‌బీఎస్ కాలనీలోని బీజేపీ కార్యాలయాన్ని గాని, పాత మునిసిపల్ ఆఫీసులోని మెప్మా కార్యాలయంలో గాని సంప్రదించాలని సూచించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీఎల్ నారాయణ, ప్రధాన కార్యదర్శి చరణ్, మండల ప్రధాన కార్యదర్శి బడేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 33వ రేషన్ దుకాణం పరిదిలో ఉన్న రేషన్ కార్డుదారులకు శుక్రవారం తహసీల్దార్ శేషఫణి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు మండల, పట్టణ పరిదిలో 49,851 స్మార్ట్ రేషన్ కార్డులను కార్డుదారులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ వాహీద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మాచాని మహేశ్, డీలర్ల సంఘం అధ్యక్షుడు గూడూరు బాషా, నరసింహులు, కార్డు దారులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన డిజిటల్ రేషన్ కార్డుల ద్వార లబ్ధిదారులు రేషన్ సరుకులను సులభంగా పొందవచ్చునని డిప్యూటీ తహసీల్దార్ రఘువీర, టీడీపీ మండల కన్వీనర్ తిరుపతయ్యనాయుడు, సింగిల్‌విండో ప్రెసిడెంట్ రామాంజినేయులు అన్నారు. గురువారం గోనెగండ్లలోని రేషన్‌లబ్ధిదారులకు ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ రఘువీర మాట్లాడుతూ మండలంలో 23,375 రేషన్ కార్డులు ఉన్నాయని, వాటిని మండలంలోని 43 రేషన్‌షాపులకు అనుసంధానం చేశామని తెలిపారు. ఆర్ఐ రామయ్య, గ్రామ రెవెన్యూ అధికారి నారాయణ, టీడీపీ నాయకులు చంద్రశేఖర్, షేక్షావలి, మహల్ రెహంతుల్లా, రఫీక్, జిలానీ, వలి, జానీ పాల్గొన్నారు.

నేటి నుంచి పంపిణీ

పెద్దకడబూరు: మండలంలో శనివారం నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ గీతాప్రియదర్శిని తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ డీలర్లు స్మార్ట్ కార్డులను అందజేయాలన్నారు. ఇందుకోసం లబ్ధిదారులు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది జర్మియా, డీలర్లు పాల్గొన్నారు.

బీఎస్పీ మంత్రాలయం ఇన్‌చార్జిగా లక్ష్మన్న

మంత్రాలయం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్‌వాది పార్టీ మంత్రాలయం నియోజకవర్గ నూతన ఇన్‌చార్జిగా బూదూరు గ్రామానికి చెందిన రామతీర్థం లక్ష్మన్నను నియమించినట్లు బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి మంచాల లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు బొగ్గుల అనుమన్న, గుడిసె సామేలు తెలిపారు. శుక్రవారం మంత్రాలయంలో బీఎస్పీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అదే విధంగా బడుగు, బలహీన వర్గాల కోసం పనిచేసే పార్టీలో పనిచేయటం ఆనందంగా ఉందని లక్ష్మన్న అన్నారు. కార్యక్రమంలో రామలింగయ్య, స్వామిదాసు, డేవిడ్, సుదర్శనం, రాజు, అజయ్, విక్రమ్, ఏసేపు, సంసోను, బజారి, ఆరోని పాల్గొన్నారు.

పంట సస్యరక్షణ చర్యలపై అవగాహన

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాబు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం షణ్ముఖ అగ్రిటెక్ కంపెనీ ఆధ్వర్యంలో పంటల సస్యరక్షణ, పంట కీటక నాశుల నుంచి రక్షణపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కంపెనీ శాస్త్రవేత్త శశిధర్ పంటల సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బాబురావు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శేఖర్ బాబు, ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేంద్ర బాబు, వైస్ ప్రెసిడెంట్ శీలన్న పాల్గొన్నారు.



పురుగు మందును ప్రదర్శిస్తున్న కంపెనీ ప్రతినిధులు

ఘనంగా ఐలమ్మ జయంతి

మంత్రాలయం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రజక సంఘం నాయకులు రమేశ్, రాము, నర్సప్ప, ఆంజనే యులు ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్ర పటం వద్ద నివాళి అర్పించారు. రజక సంఘం నాయకులు నరేశ్, అశోక్, రామాంజినేయులు, భీమా, అంజినప్ప పాల్గొన్నారు.

అనాథకు అంత్యక్రియలు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనాథ మృతదేహానికి పూలే అంబేడ్కర్ సొసైటీ సభ్యులు శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. పూలే అంబేడ్కర్ సొసైటీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు మాట్లాడుతూ కొన్ని రోజుల నుంచి పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలో ఈడిగ వసంతమ్మ (63) బాడుగ ఇంట్లో నివాసం ఉంటోంది. ఆమె దయనీయ పరిస్థితిలో ఉండడంతో కాలనీ వాసులు పూలే అంబేడ్కర్ సొసైటీకి సమాచారం ఇచ్చారు. దీంతో వృద్ధురాలిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమెకు అనాథ కావడంతో పూలే అంబేడ్కర్ సొసైటీ సభ్యులు కమలె గణేశ్, సలహాదారు ఏంకోబు, వ్యవస్థాపక అధ్యక్షుడు నరసన్న బీసీ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఉద్యోగ కల్పనే ప్రభుత్వ లక్ష్యం

పెద్దకడబూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చదువుకున్న ప్రతి నిరుద్యోగుకి ఉద్యోగం కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీని విడుదల చేసి వేల మందికి ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం చంద్రబాబునాయుడుకే దక్కిందన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలను కల్పించేందుకు ముందడుగు వేయడం అభినందనీయమన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మరిన్ని ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. రాష్ట్రం సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారాలోకేశ్ నేతృత్వంలో అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తోందని అన్నారు. ఈ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని అన్నారు. ఈ ప్రభుత్వంపై ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోందన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

పెద్దకడబూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, చిన్నారులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రంలో లభించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ అధికా రులు సూచించారు. పెద్దకడబూరులో శుక్రవారం 8వ రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీడీపీవో రాజేశ్వరిదేవి, సూపర్‌వైజర్ విజయకుమరి పోషణ మహోత్సవ ప్రత్యేకతను వివరించారు. రక్తహీనతతో బాధపడే పిల్లలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వలన ఆ సమస్యను సులభంగా అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలను నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఇంక్రిమెంట్ ఇవ్వాలి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల పాటు ఒకే క్యాడర్‌లో పని చేసిన వారికి స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని ఎమ్మిగనూరు వార్డు సచివాలయ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గోవిందురాజులు కోరారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి, తహసీల్దార్ శేషఫణికి శుక్రవారం వినతి పత్రాలు అందజేశారు. సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు గత 15 రోజుల క్రితం ఇచ్చిన వినతి పత్రంపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో భవిష్యత్తు కార్యాచరణను కర్నూలులో జరిగే మహాసభలో తెలియజేస్తామన్నారు. యూనియన్ జనరల్ సెక్రటరీ రవి కిరణ్, ట్రెజరీ రజనీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ హంపి రెడ్డి, వార్డు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

వెండి గజ వాహనంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలు వెండి గజవాహనం పై బంగారు అంబారిలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శుక్రవారం అశ్వయుజ చవితి శుభదినం పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య వెండి గజవాహనంపై స్వర్ణ అంబారిలో వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి అర్చకుల మహా మంగళ హారతితో ఆలయ ప్రాంగాణ ం చుట్టూ ఊరేగించారు. పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.